# ధర్మదేవత గుడ్డికళ్ళు

"చస్తినో! అయ్యో! అమ్మో! నీ జిమ్మడ. నీకు పొయ్యేకాలం రాను!"

లచ్చి మొగుడి చేతిలోనుంచి జుట్టు విడిపించుకొనే ప్రయత్నం చేస్తూనే తిడుతోంది. ఏడుస్తోంది.

లచ్చి జుట్టు పట్టుకొని గభీ గభీమని వంగదీసి గుద్దుతున్నాడు సుబ్బన్న- షావుకారుపేటలోవున్న జయరాం శెట్టి మూడు అంతస్థుల మేడ ముందున్న పేవ్‌మెంటుమీద.

దారినపోయే జనం చుట్టూ మూగారు.

పెద్దరికానికి పేరు మోసిన పెద్ద మనుషులు జనాన్ని తోసుకుంటూ ముందుకెళ్ళి నిలబడ్డారు.

'ఒరేయ్! ఏమిట్రా ఆ పని? దాన్ని వదులు!' గదమాయించాడు ఓ బుర్ర మీసాల పెద్దమనిషి.

ఏదో మించిపోతున్నట్టు 'పళ్ళగంప' జనం ఒకర్నొకరు తోసుకుంటూ ముందుకొస్తున్నారు.

పేవ్‌మెంటుమీద సంసారం గడుపుతున్న సుబ్బన్నకు, ఠపీమని తలుపులు ముయ్యడానికి వీల్లేదు. కనుక, లచ్చిని ఆ పేవ్‌మెంటు మీదే వెల్లకిలా పడేలా ఓ తోపు తోసి, చుట్టూ చేరిన గుంపును చూస్తూ, గొణుక్కుంటూ దిమ్మె దగ్గిరకు పోయి దబ్బనాన్ని కసిగా 'టక్ టక్' మని సాగకొడ్తున్నాడు సుత్తితో.

"ఎందుకురా దాన్నంతగా కొట్టావ్?" ఓ ఖద్దరు సిల్కు లాల్చీలోవున్న పెద్దమనిషి, అన్యాయపు అంతు తెలుసుకోవాలనే మనస్తత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రశ్నించాడు.

జారిపోయిన పైటను సర్దుకుంటూ, కింది పెదవినుంచి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ, గోడకు చేరబడి వెక్కి వెక్కి ఏడుస్తూంది లచ్చి.

దబ్బనం మొన సన్నగా సాగకొడ్తూ, మధ్య మధ్య లచ్చివైపు చుర చుర చూస్తున్నాడు సుబ్బన్న.

ఎండ చిటపటలాడుతోంది. సుబ్బన్న నుదురునుంచి ఖర్మజలం కారుతోంది, దిమ్మె మీదకు.

గుండ్రని ముఖం, ఎత్తైన నున్నటి బుగ్గలు, చామన చాయ, రక్తంతో ఎర్రబడ్డ పెదవులు- మంచి వయసులో వున్న లచ్చికి కొత్త అందాన్ని ఇస్తున్నాయి.

వయసులోవున్న ఆడది- అందంగావున్న ఆడది- ఏడుస్తుంటే చాలామందికి జాలివేసింది. తలొక రకంగా తమ సానుభూతి చూపిస్తున్నారు.

'అసలెందుకే వాడు నిన్ను కొట్టిందీ?' జరీ కండువాను సర్దుకుంటూ అడిగాడు లచ్చిని ఓ జలసారాయుడు.

"ఏం లేదు దొరా! పొద్దున్నుంచీ ఇట్టాగే సంపేత్తున్నాడు సచ్చినోడు!" అన్నది లచ్చి వెక్కిళ్ళ మధ్యలో.

"ఒసేయ్! ముయ్యే నోరు! అబద్దాలు కూశావంటే సూడు-గొంతు పిసికేత్తా!" చేతిలోని సుత్తి విసురుగా కింద పడేసి లేవబోయాడు సుబ్బన్న.

'ఒరేయ్! ఆగరా!' అంటూ గుడ్లు ఉరిమేదు ఓ బుర్రమీసాల నాయుడు సుబ్బన్నకి దగ్గరగా వచ్చి.

'కాద్దొరా! పొద్దుటినుంచి సెప్తున్నా దొరా దానికి- సూదులు, దబ్బనాలు ఎత్తుకెళ్ళి బువ్వడుక్కురాయె అనీ- నిన్న పొద్దుననంగ కూస్తంత గంజి తాగిన దొరా! ఆకలేత్తుంది, పోయి రాయె అంటే కదల్దు. ఆ వజాన మొండికేసి కూకుంది' అన్నాడు సుబ్బన్న.

"ఏమే! వాడు చెప్పేది నిజమేనా?" అంటూ బుర్రమీసాల నాయుడు లచ్చికేసి చూశాడు.

అందరూ లచ్చినే చూస్తున్నారు.

సుబ్బన్న మళ్ళీ దిమ్మెముందు కూర్చున్నాడు. సుత్తితో దిమ్మెమీద కసితో గట్టిగా కొడ్తున్నాడు.

"రాత్తిరికాడనుంచి కాళ్ళూ, చేతులూ పీకుతున్నాయి దొరా! తల నొప్పేత్తుంది. ఈ ముదనష్టపోడు పొద్దుటినుంచి చావతంతున్నాడు దొరా!" అంటూ లచ్చి ఒక్కసారిగా బావురుమని ఏడుపుకు లంకించుకుంది.

ఆ దెబ్బతో లచ్చి సానుభూతిపరుల సంఖ్య పెరిగి పోయింది.

'అసలు సంగతేమిటి?' అప్పుడే వచ్చినవాళ్ళు పక్కవాళ్ళను కుతూహలంగా అడుగుతున్నారు.

'ఒరేయ్ పశువా! ఒంట్లో బాగాలేనిదాన్ని అలా కొడ్తావట్రా?' ఖాదీ సిల్కు లాల్చీ మందలించింది.

'అదొట్టి దొంగది దొరా! నిన్నొచ్చిన డబ్బులన్నీ రాత్తిరి కరుసు చేసింది. ఊళ్ళోకి పోయి సూదులూ, దబ్బనాలూ అమ్ముకు రాయే అంటే మంకు కేసింది దొరా! సోంబేరి ముండా! అబద్దాలు సెప్తావంటే?' లచ్చికేసి మింగేసేట్టు చూశాడు సుబ్బన్న.

'నాకియ్యలేదు దొరా! సత్తెపమాణంసేసి సెప్తుండా. రాత్తిరి డబ్బులన్నీ దేనికో ఇచ్చిండు. నన్ను ఆ వజాన సావ తంతుండు. ఎప్పుడూ ఇట్టానే ఏదిత్తా వుంటాడు. ఈడి సిరిసు పగల.' లచ్చి తిట్లకు లంకించుకుంది.

సుబ్బన్నకు వళ్ళు మండిపోయింది. ఇక ఆగలేకపోయాడు. చివ్వున లేచాడు. తప్పించుకు పారిపోబోతున్న లచ్చి జుట్టు ఒక్క దూకులోపోయి దొరకబుచ్చుకున్నాడు.

"తప్పుడు కూతలు కూత్తావంటే లం..." అంటూ వంగదీసి 'దబీ దబీ' బాదసాగాడు.

"ఒరేయ్! వదల్రా దాన్ని! ఆగరా!" అంటూ ముందు వరసలోవున్న గళ్ళ లుంగీ నడివయసువాడు అడ్డం వెళ్ళాడు. మరికొందరు కూడా లచ్చిని రక్షించడానికి నడుం కట్టుకొని ముందుకు దూకడానికి సిద్ధంగా వున్నారు.

మెడలమీదకు జుట్టు పెంచుకొన్న ఒక యువకుడు సుబ్బన్న రెక్క పట్టుకొని ఒక్క లాగు లాగాడు. మరో ఇద్దరి ముగ్గురి సాయంతో సుబ్బన్నను వెనక్కు నెట్టుకెళ్ళాడు.

పట్టుకున్నవాళ్ళనుంచి ఒక్క కుదుపుతో తనను వదిలించుకున్నాడు సుబ్బన్న.

లచ్చి స్వరం తారస్థాయిలో విన్పిస్తోంది. సుబ్బన్నని తిట్టిపోస్తున్నది.

"తన్నండి వెధవను. పొగరెక్కి చస్తున్నాడు." మీసాల నాయుడు రంకె వేశాడు.

'ఒరేయ్ పశువా! ఆడదానిమీద చెయ్యి చేసుకుంటావంటరా!" అన్నాడు గ్లాస్కో ధోవతిలోవున్న యువకుడు, చేతిలోవున్న 'సంస్కృతి' పత్రికను సర్దుకుంటూ.

'మీకు తెలవదు దొరా! మీరెల్లండి. మీరుంటే అది అట్టాగే మంకేశం ఏసుద్ది.' సుబ్బన్న బుసకొట్టాడు.

అతడి కళ్ళు నిప్పుకణికల్లా కణకణలాడుతున్నాయి. పెదవులు కసితో వంకర్లు తిరుగుతున్నాయి. పళ్లు బిగించి జనాన్ని తప్పుకొని లచ్చికేసి చూస్తున్నాడు.

'ఒరేయ్! ఈ తడవ దాని వంటిమీద చెయ్యి పడిందా– నీ తాట వలుస్తాను. జాగ్రత్త!' ఖద్దరు సిల్కు లాల్చీ అన్నది.

'మీకేందశ? నా పెళ్ళాం. నా ఇష్టం. కొట్టుకుంటా. తిట్టుకుంటా. మీరెల్లిపోండి.' వళ్లు తెలియని కోపంతో చుట్టూ చేరిన వాళ్ళను కసురుకొన్నాడు సుబ్బన్న.

'ఒరేయ్! నీ పెళ్ళాన్ని కొడ్తే ఊరుకుంటామట్రా?' సంస్కృతి పేపరు–

'ఆఁ! ఎంత పొగ్రరా నీకు?' బుర్ర మీసాలు–

"మనమంతాపోతే ఇవ్వాళ వీడు దీన్ని బతకనివ్వడు." చీలమండలంటుకోవడానికి ప్రయత్నిస్తున్న ఎం.ఎస్.55 చొక్కా– ఆంధ్ర విద్యార్థిలా వున్నాడు.

"వీడి తిక్క ఇలా కుదర్దులే." ఖద్దరు లాల్చీ మీసాలనాయుడి చెవులో గుసగుసలాడింది.

జనం వాళ్ళిద్దరివైపూ చూస్తున్నారు కుతూహలంగా.

ఇంటిముందు జరుగుతున్న గందరగోళానికి, రూపాయి విలువ తగ్గింపును గురించి పత్రికలో చదివి, బంగారు వస్తువులేమీ అమ్మవద్దని గుమాస్తాతో చెబుతున్న జయరాంశెట్టి కంగారు తిన్నాడు. మొదటి అంతస్థు వరండాలో నిల్చుని కింద గుమిగూడిన జనాన్ని చూడసాగాడు. కిందకు వెళ్ళిన గుమస్తా తిరిగొచ్చి విషయం వివరించాడు. దాంతో శెట్టి రిలీఫ్‌గా గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు. పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేశాడు.

"హల్లో! ఆ! నేను జయరాం శెట్టిని... ఇక్కడ.. మా ఇంటిముందు కొట్లాట జరుగుతూంది... అవును... త్వరగా రండి... అర్జెంటు... థాంక్సు..." ఫోన్ పెట్టేసి మళ్ళీ వరండాలోకి వెళ్ళి నిల్చున్నాడు.

"పోనియ్యండి మనకెందుకు? వాళ్ళ గొడవేదో వాళ్లు పడ్తారు" అన్నాడు ఒక ముసలాయన జనంలోనుంచి తప్పుకొని వెళ్తూ.

"మా బాగా చెప్పావయ్యా? కళ్ళముందు ఇంత ఘోరం జరుగుతూ వుంటే చూస్తూ ఊరుకోమంటావా? ఏం పెద్దమనిషివయ్యా?" అందుకున్నాడు ఓ పెద్ద మనిషి.

'ఘోరమంట! ఘోరం? మనందరిళ్ళల్లో జరిగే ఘోరమంతానో?' విసురుగా అన్నాడు ముసలాయన.

'ఏంటా ముసలిపీనుగ సణుగుడు?'

"నోరు ముయ్యవయ్యా!"

అందరూ తలొక మాటా అని ఆ ముసలాయన నోరు మూయించారు.

లచ్చి కొంచెం శృతి తగ్గించి బెదురుగా జనంకేసి చూస్తోంది.

సుబ్బన్న తన సామాను సర్దుకుంటూ ఏమోమో తిట్టుకుంటున్నాడు.

ఆ తిట్లలో భాగం లచ్చితోపాటు, జనానికికూడా లేకపోలేదు.

అంతలో పోలీసు ఇన్‌స్పెక్టర్ నలుగురు కానిస్టేబుల్స్‌తో వచ్చాడు.

పోలీసు లాఠీతో జనాన్ని సర్దుతున్నాడు.

"ఏమిటీ న్యూసెన్స్?" పోలీస్ ఇన్‌స్పెక్టర్ టోపీ సర్దుకుంటూ అన్నాడు.

"ఇదుగో వీడే! దొంగ వెధవ! దాన్ని చంపేస్తున్నాడు." సుబ్బన్ననూ, లచ్చినీ చూపిస్తూ అన్నాడు నాయుడు మీసాలు తిప్పుకుంటూ.

'మేము అడ్డం రాకపోతే ఈపాటికి దాని ప్రాణాలు తీసేసి వుండేవాడు. వెధవ!' ఖద్దరు సిల్కు లాల్చీ తాలూకు పెద్దమనిషి.

భయంతో వణికిపోతూ మోకాళ్ళమీద జారిపడి 'లేదు దొరా! మీ కాళ్ళకు మొక్కుతా." అంటూ చేతులు జోడించిన సుబ్బన్న గుండెలమీద ఇన్‌స్పెక్టర్ బూటు నాడాలు నాట్యం చేశాయి.

వెల్లికితలా పడ్డ సుబ్బన్నను, రెక్కలు పట్టుకొని లాగి నిల్చోబెట్టారు ఇద్దరు కానిస్టేబుల్స్.

అంతవరకూ అయోమయంగా చూస్తున్న లచ్చి ఒక్కసారిగా పెద్దపెట్టున ఏడుస్తూ ఇన్‌స్పెక్టర్ కాళ్ళమీద పడింది.

'ఆడిని ఏం చెయ్యకండి దొరా! ఆడి తప్పేమీ లేదు. నేనే... నాదే తప్పంతా... ఆడ్ని వదిలెయ్యండి.' గోలగా ఏడుస్తూ అన్నది.

ఇన్‌స్పెక్టర్ కాళ్ళమీద పడబోతున్న సుబ్బన్నను ఇద్దరు పోలీసులు వాన్ దగ్గరకు లాక్కెళ్లారు.

లచ్చి సుడిగాలిలా వెళ్ళి సుబ్బన్నను కౌగలించుకుంది.

"వదలండి బాబూ! మీ కాళ్ళకు మొక్కుతా." లచ్చి ప్రాధేయపడసాగింది.

లచ్చిని బలవంతంగా అవతలకు నెట్టి, సుబ్బన్నను పోలీసు వాను ఎక్కించారు. కాళ్ళమీద పడ్డ లచ్చిని వదిలించుకొని, శెట్టిగారి దగ్గిర శెలవు తీసుకొని ఇన్‌స్పెక్టరు వాన్‌లో ఎక్కాడు.

లచ్చి తల బాదుకుంటూ లబోదిబోమని ఏడుస్తూ వుంటే, బుర్రమీసాలు, ఖద్దరు లాల్చీ, గ్లాస్కో పంచా గుడ్లు మిటకరించి చూడసాగాయి.

వాన్ కదిలి వేగం అందుకుంది. లచ్చి అరుస్తూ, ఏడుస్తూ వేన్ వెనక పరుగులు తీస్తున్నది.

జనం ఆమెని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అలగా జనం! నీతా జాతా ! దాన్ని చూడండి." ఖాదీ సిల్కు లాల్చీ ఆముదం తాగిన ముఖంపెట్టి అన్నది.

'అరేరే ! దీని తస్సాదియ్యా !' నాయుడు చిత్తై మీసం పీక్కుంటూ జనంలోనుంచి బయటపడ్డాడు.

"పేదోళ్ళ సంసారం పెద్దోళ్ళకు లోకువ. పేదోళ్ళకు మాత్రం ప్రేమ లుండవా?" మొదటి ముసలాయన అందుకున్నాడు.

"ఎందుకుండవూ? వుంటాయి." వెటకారంగా అన్నాడు నాయుడు.

'రామరాజ్యంలో జాంబవంతుడి న్యాయం!' కాండ్రించి ఊశాడు ముసలాయన,

వాన్ వెనకే పరుగుతీస్తున్న లచ్చిని చూస్తూ.

✿ ✿ ✿

సుబ్బన్నను ఇరవై నాలుగు గంటలు రిమాండ్‌లో పెట్టారు. ఆ రాత్రి సుబ్బన్న వున్న జైల్‌లో మరో ఖైదీని పెట్టారు. అతడి తలకు కట్టుకట్టి వుంది. ముఖంమీద రక్తం గడ్డకట్టిన చారికలు వున్నాయి. పాలిపోయిన శరీరం. చాలా నీరసంగా కన్పిస్తున్నాడు. కళ్ళల్లో ఏదో ప్రత్యేకత కన్పిస్తున్నది. గోడకు చేరబడి నీరసంగా కూర్చుని వున్నాడు.

ఆ వ్యక్తిని చూడగానే సుబ్బన్నకు శరీరం గగుర్పొడిచింది.

కొంచెంసేపు కన్నార్పకుండా చూశాడు.

'ఓరు బాబూ తవరు?' అని అడిగాడు.

అతడు తలెత్తి సుబ్బన్న ముఖంలోకి ఓ క్షణం చూశాడు.

"ఇవ్వాళ్టినుంచి చచ్చేంతవరకు ఖైదీని" అన్నాడు ఆ వ్యక్తి అదోలా నవ్వుతూ.

'అంటే ఖూనీ కేసా బాబూ?'

'కాదు.' నిర్లిప్తంగా పలికింది అతడి కంఠం.

'దొంగతనమా దొరా?'

'ఊఁహూ! కాదు.'

దొంగతనం కాదు. ఖూనీ కాదు. మరేంటో?

సుబ్బన్న ఆలోచనలో పడ్డాడు. కాని ఎంత ఆలోచించినా ఏమీ తట్టలేదు.

'అయితే తవరు చేసిన నేరం ఏంది బాబూ?' అశ్చర్యంగా ప్రశ్నించాడు.

"మనిషి మనిషిగా బతకాలనీ, మనిషికీ-జంతువుకూ భేదం వుందనీ-మనిషి కుక్కలా బతక్కూడదనీ నమ్మాను."

"అదేంది బాబూ?"

అంతా అయోమయంగా వుంది సుబ్బన్నకు.

"చిన్నమెత్తు ముక్కు పోగుకోసం మనిషి పసిబిడ్డ గొంతు నులిపే పరిస్థితులు వుండకూడదన్నాను. కడుపు కక్కుర్తికోసం మన అక్కచెల్లెళ్ళు శరీరం అమ్ముకొనే సమాజం అక్కర్లేదన్నాను."

"ఏదో అంటేనే జైల్లో పెట్టారా?" విస్మయంగా చూశాడు సుబ్బన్న.

"నగ్నంగా..."

'అదేంది దొరా!'

'గుడ్డలు లేకుండా, వందలమంది తోటివాళ్ళతో, స్త్రీల ముందు నుంచోడాన్ని వ్యతిరేకిస్తూ నాలోని మానవత్వం స్పృహ వున్నదాకా తిరుగుబాటు చేసింది.' ఓ క్షణం ఆగి "తెలిసిందా నేను చేసిన నేరం ఏమిటో?" ఉద్రేకంతో అన్నాడు ఆ యువకుడు.

సుబ్బన్నకు అతను చెప్పిందేమిటో అర్థంకాకపోయినా, ఎక్కడో అన్యాయం వుందని మాత్రం అర్థం అయింది.

"ఎంతన్నాయం బాబూ! ఆళ్ళ కళ్ళు పోతాయి బాబూ!" అన్నాడు.

"అది సరే! నువ్వెందుకొచ్చావ్? దొంగతనం చేశావా?" అడిగాడు ఆ యువకుడు సుబ్బన్నను.

'లేదు బాబూ!'

'మరి?'

'ఏం లేదు బాబూ! మా ఆడదీ నేనూ కూస్త కీసులాడుకున్నాం. ఆ వజాన దానికి

రెండు తగలనిచ్చాను. దారినపోయే ఆళ్ళూ-ఈళ్ళూ చేరి పెద్ద యాగీ చేశారు. పోలీసోళ్ళకు పట్టించారు దొరా!'

'నీ భార్యను కొట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది?' అడిగాడు ఆ యువకుడు.

'అది శానా గడుసుది దొరా! పన్లోకి పోయే అంటే ఒంట్లో ఉసుల్లేదని మొరాయించింది.'

'అంతమాత్రానికే కొడ్తావా? నిజంగానే సుస్తీగా ఉందేమో? నీ కసి ఆమెమీద చూపిస్తే ప్రయోజనం ఏమిటి?'

ఓ క్షణం ఆగి మళ్ళీ అన్నాడు- 'జబ్బుతో చెయ్యలేని స్థితిలోవున్నా, రెక్కల ముక్కలయేట్టు చాకిరీ చేస్తేగాని పొట్టనిండని పరిస్థితులమీద నీ కసి తీర్చుకో. నీ ఆకలి మంటలకు నీతో జ్వలిస్తున్న నీ భార్య ఎర కాకూడదు. నీలాగే కష్టించి పనిచేసే నీ పక్కవాడిమీద నీ కసి చూపించకూడదు. పొద్దస్తమానం ఎముకలు పిండి మూలుగు ధారపోసినా, అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితులు ఎందుకున్నాయో తెలుసుకో. ఆ పరిస్థితులను మార్చడానికి ప్రయత్నించు. నీ ప్రయత్నానికి అడ్డం వచ్చినవాళ్ళమీద చూపించు నీ కసి...'

'ఏయ్! జైల్లోకూడా మొదలుపెట్టావ్?' జైలు వార్డరు దగ్గరకు వస్తూ అన్నాడు.

ఓ క్షణం ఆగి 'వీళ్లక్కూడా నూరిపోస్తున్నావా? నీ పని ఇట్టా కాదులే. పద!' వార్డరు ఖైదీని పక్క గదిలోకి తీసుకెళ్ళాడు.

'ఇదిగో, ఇంకెప్పుడూ నీ భార్యను కొట్టవు కదూ?' వెళ్తూ సుబ్బన్నతో అన్నాడు ఖైదీ.

'పెమాణం సేత్తున్నా దొరా! ఇంకమీన లచ్చివంటిమీన సెయ్యి ఎయ్యను దొరా! తెలిసొచ్చింది. దేవుడల్లే సెప్పారు.'

కళ్ళలో కాంతిరేఖలతో, కదిలిపోతున్న ఖైదీని ఇనుపసువ్వల్లోనుంచి సాగనంపాడు సుబ్బన్న కన్నీళ్ళతో.

పోలీసులు తనను వాన్ ఎక్కిస్తున్నప్పుడు గుండెలు బద్దలయ్యేలా ఏడ్చిన లచ్చి, వాన్ వెనకే ఏడుస్తూ పిచ్చిగా పరుగులు తీసిన లచ్చి రూపం కళ్ళల్లో మెదిలింది. జుట్టు పీక్కున్నాడు సుబ్బన్న.

తెల్లవారింది.

సుబ్బన్నను వదిలేశారు. లచ్చి ఏమైందోనన్న ఆదుర్దాతో బయటికి వచ్చిన సుబ్బన్నను లచ్చి చుట్టుకుపోయింది. వెక్కి వెక్కి ఏడవసాగింది. జైలుకెదురుగా వున్న చెట్టుకిందే రాత్రంతా కూర్చుని సుబ్బన్నకోసం ఎదురుచూసిన లచ్చి, భర్తను చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చి అల్లుకుపోయింది.

సుబ్బన్న లచ్చిని గుండెకు హత్తుకున్నాడు.

లచ్చి వళ్లు జ్వరంతో మండిపోతున్నది.

లచ్చి తలమీద పడ్తున్న సుబ్బన్న కన్నీటిబొట్లు ఆవిరైపోతున్నాయి.

ధర్మదేవత గుడ్డికళ్లు చెమ్మగిల్లాయి.

(1952లో, మద్రాసు అంతర్కళాశాల పోటీలలో
ప్రథమ బహుమతి పొందిన కథ. ఇది నా రెండో కథ)